సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం ǀ 1 ǀ ఆగస్టు ǀ 2024



సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి
ఉద్యోగ విరమణ అనంతరం సిబ్బంది సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.
- 8లో ▸



ఆధునిక పరికరాలపై రైతులకు అవగాహన
- 8లో ▸
ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు ఆధునిక యంత్ర పరికరాలపై బుధవారం అవగాహన కల్పించారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31⁰/24⁰

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అధ్యాపకుల్ని నియమించాలని ర్యాలీ



విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఫ్యాకల్టీని నియమించాలని డైట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం వరంగల్, హనుమకొండ డీఈఓ కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. డీఈఓలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయా విద్యార్థులు మాట్లాడుతూ.. ఈవిద్యాసంవత్సరంలో తమకు పాఠ్యాంశాలు బోధించేవారు లేరన్నారు. ఇద్దరు స్వచ్ఛందంగా రిటైర్డ్ అధ్యాపకులు బోధిస్తున్నారని తెలిపారు. సిలబస్ పూర్తి కావడంలేదని, తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

నగరంలో చైన్ స్నాచింగ్‌లు



చైన్ స్నాచింగ్ అనుమానితుడు

రామన్నపేట: వరంగల్ నగరంలోని కొత్తవాడ, మేదరివాడలో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. కొత్తవాడలోని మడేలయ్య గుడి వద్ద నుంచి వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన వివాహిత వనజ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల పుస్తెల తాడును బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు. అదే విధంగా రాత్రి 10 గంటల సమయంలో మేదరివాడలోని చౌదాపూడి దుకాణానికి వచ్చిన వృద్ధురాలు భాగ్యలక్ష్మి మెడలో నుంచి తులంన్నర బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం అనుమానితుడి ఫొటోను విడుదల చేశారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు
విద్యారణ్యపురి: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆగస్టు 20 వరకు గడువు పొడిగించినట్లు హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. బుధవారంతో గడువు ముగియగా.. ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఆగస్టు 20వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం ఇచ్చారని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

ట్రెజరీ డీడీగా శ్రీనివాసకుమార్



హన్మకొండ అర్బన్: ప్రస్తుతం జిల్లాలో ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న గుజ్జు రాజు బదిలీపై హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో ములుగు డీఆర్డీఓగా పని చేస్తున్న ఆకవరం శ్రీనివాసకుమార్‌ను మాతృ శాఖకు పంపిస్తూ.. హనుమకొండ జిల్లా ట్రెజరీ డీడీగా పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాసకుమార్ గతంలో డీఆర్డీఏ పీడీగా సుదీర్ఘకాలం పాటు జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది. సుమారు ఎనిమిదేళ్ల పాటు జిల్లాలో ట్రెజరీ డీడీగా పని చేసిన రాజు జిల్లా నుంచి బదిలీ అయ్యారు. రాజు జిల్లాలో పని చేసినంత కాలం ఉత్తమ పనితీరుతో అందరి మన్ననలు పొందారు.

రిజిస్ట్రేషన్ల రికార్డు బ్రేక్
కాజీపేట అర్బన్: వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం రికార్డులు బ్రేక్ అయ్యాయి. మంగళవారం 265 దస్తావేజుల రిజిస్ట్రేషన్లను రాత్రి 9 గంటల వరకు పూర్తి కాగా.. ఖజానాకు రూ.2.10 కోట్ల ఆదాయాన్ని సబ్ రిజిస్ట్రార్లు అష్ఫద్, రాజు అందజేశారు. బుధవారం 272 దస్తావేజులకు రాత్రి 8.30 నిమిషాలకు వరకు రిజిస్ట్రేషన్లను పూర్తి చేసి ఖజానాకు సుమారు రూ.2.30 కోట్ల ఆదాయం సమకూర్చారు. మార్కెట్ వాల్యూ పెరుగుతుందని, సబ్ రిజిస్ట్రార్ల బదిలీ ఉందని భూక్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పోటెతుతున్నారు. కానీ ప్రభుత్వం మార్కెట్ వాల్యూ పెంపుపై ఉత్తర్వులు జారీ చేయలేదని విశ్వసనీయ సమాచారం.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
కాజీపేట అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం (నేటి నుంచి) తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి మధురిమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యాన్ని చాటుదాం' నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుంత.. చింత



కాజీపేట తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్కిల్ -2 మున్సిపల్, అగ్రికల్చర్ కార్యాలయం, డిస్పెన్సరీతో పాటు మీసేవా కేంద్రానికి నిత్యం స్థానికులతోపాటు వివిధ గ్రామాల ప్రజలు వస్తుంటారు. ప్రధాన గేట్ వద్ద బురదమయమైన గుంతలు స్వాగతం పలుకుతున్నట్లు ఉన్నాయి. వరద నిండి ప్రమాదకరంగా మారాయి. రోజూ మున్సిపల్ అధికారులతోపాటు సిబ్బంది నడిచే దారిలో దర్శనమిస్తున్న గుంతలు, బురద కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. - కాజీపేట అర్బన్

సార్.. స్లాబ్



హనుమకొండలోని అమృత థియేటర్ నుంచి గుడిబండల్ వెళ్లే దారిలో రైతు మోడల్ చికెన్ సెంటర్ ఎదుట ఉన్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. ఈశిథిల డ్రెయినేజీపై స్లాబ్ వేసేందుకు నెల రోజుల క్రితం తవ్వారు. పైపులు వేయకుండా విస్మరించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బల్దియా అధికారులకు సమాచారం లేకుండా స్థానిక దుకాణాదారులే తవ్వినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి స్లాబ్ వేయాలని కోరుతున్నారు. - హన్మకొండ చౌరస్తా

కళాతోరణం.. కళావిహీనం!



కాజీపేట జంక్షన్ పరిధి రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన కాకతీయ కళాతోరణాన్ని పిచ్చిచెట్లు కమ్మేశాయి. కాజీపేట-హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గం బాపూజీనగర్‌నుంచి చూస్తే కళాతోరణం ఎంతో సుందరంగా కనిపించేది. ఇప్పుడు ముళ్ల పొదలతో నిండి కనిపించడం లేదని స్థానికులు తెలుపుతున్నారు. రైల్వే అధికారులు పట్టించుకుని చెట్లను, గడ్డిని తొలగించి తోరణాన్ని కొత్త హంగులతో అలంకరించాలని పలువురు అంటున్నారు. - కాజీపేట రూరల్

నీడ లేక.. నిలబడలేక



నగరంలోని పోచమ్మమైదాన్ సెంటర్‌లోని రత్నహోటల్ పక్కన ప్రధాన రహదారిపై ఉన్న బస్‌షెల్టర్ ఏడాది క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా అధికారులు కూల్చివేశారు. కొత్త షెల్టర్ కోసం ఇనుప స్తంభాలు పాతారే కాని పూర్తిగా నిర్మాణం చేపట్టలేదు. ప్రయాణికులు కూర్చునేందుకు చోటు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నారు. స్థానిక వ్యాపార సంస్థలు, రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు బస్‌షెల్టర్ నిర్మాణంలో జాప్యం చేస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. - రామన్నపేట

బదిలీల రచ్చ..



వైద్య ఆరోగ్యశాఖలో 'పోస్టింగ్'లపై ఇంటెలిజెన్స్ ఆరా

- ఏఎన్‌ఎం నుంచి పలు కీలక అధికారుల బదిలీలపై విమర్శలు
- సంఘాల సిఫారసులు, ప్రజాప్రతినిధుల లేఖలపై ఆరా
- అసెంబ్లీ సమావేశాల ముగింపులోపు నివేదిక
- బదిలీలపై మళ్లీ ప్రభుత్వం నిషేధం

సాక్షిప్రతినిధి, వరంగల్:

ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సెలింగ్, బదిలీల సందర్భంగా పలుచోట్ల జరిగిన అక్రమాలపై రచ్చ అవుతోంది. ప్రధానంగా వైద్య ఆరోగ్యశాఖలో పలువురి పోస్టింగ్‌లపై కొందరు సహ ఉద్యోగులే వైరల్ చేస్తుండడం వివాదాస్పదంగా మారింది. నిషేధం ఎత్తివేసిన ప్రభుత్వం జూలై 5 నుంచి 31 వరకు కౌన్సెలింగ్, బదిలీల ప్రక్రియ నిర్వహించిన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం నుంచి మళ్లీ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వశాఖల్లో బదిలీల ప్రక్రియ నిలిచిపోనుండగా.. సుమారు 26 రోజులపాటు జరిగిన బదిలీల్లో పలుచోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణల మేరకు ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తుండటం ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సిఫారసు లేఖలు.. చిత్ర విచిత్రాలు..

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ మొదలైన రోజునుంచే కొందరు ఉద్యోగులు ఉన్నచోటనే కొనసాగేందుకు పావులు కదిపారు. ఉమ్మడి వరంగల్‌లోని సుమారు 21 చోట్ల ఈ తరహా ప్రయత్నాలు చేసిన వారిపై ఫిర్యాదులు హైదరాబాద్ వరకు వెళ్లాయి. ఫిర్యాదులు ఈసారి సంబంధితశాఖ ఉన్నతాధికారులకు కాకుండా నేరుగా ఇంటెలిజెన్స్ ఐజీ పేషీకి చేరడం కలకలం రేపుతోంది. ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్ మొదలు.. మెడికల్ ఆఫీసర్‌నుంచి వరంగల్ కేంద్రంలో కీలక ఆస్పత్రుల్లో పలువురు అధికారులు, పారా మెడికల్ సిబ్బంది స్థానచలనం కాకుండా చూసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఓ సూపర్‌వైజర్, ములుగులో ఓ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్, జేఎస్ భూపాలపల్లిలో ఓ ఫార్మసిస్ట్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక హెల్త్ అసిస్టెంట్ వివిధ కారణాలతో తమ స్థానాలను పదిలపర్చుకున్నారన్న ఫిర్యాదులున్నాయి. ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో వివిధ కేడర్లకు చెందిన సుమారు ఎనిమిది మంది పారా మెడికల్ ఉద్యోగులు.. సంఘాల నేతలను సంప్రదించి ఆ సంఘాల్లో తాము ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్నట్లు తప్పుడుపత్రాలు సమర్పించి లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుర్తింపు పొందిన సంఘాల్లో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, ట్రెజరర్లుగా కొనసాగుతున్న వారితోపాటు మరికొందరు తప్పుడు ధ్రువపత్రాలు, మెడికల్ గ్రౌండ్స్ చూపి పోస్టింగ్‌లు కొట్టేసినట్లు సమాచారం. మరికొందరు కీలక ప్రజాప్రతినిధులతో ఫోన్లు చేయించుకుని పాతస్థానంలోనే కొనసాగేందుకు బదిలీలనుంచి మినహాయింపు పొందారు. ఈ పద్ధతిన జిల్లాకు సుమారు ముగ్గురు, నలుగురి చొప్పున ఉమ్మడి వరంగల్‌లో 18 నుంచి 20 వరకు లబ్ధి పొందారని ఆశాఖకు చెందిన ఉద్యోగులే ఫిర్యాదు చేయడం గమనార్హం.

నిఘా వర్గాల ఆరా.. త్వరలోనే నివేదిక..

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల పర్వంపై ఈసారి గతంలో ఎన్నడూ లేనంతగా ఆరోపణలు వచ్చాయి. కొందరు ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వ మార్గదర్శకాలకు మంగళం పాడారన్న విమర్శలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో వీటన్నింటిపై విచారణ జరపాలని ఉద్యోగసంఘాలు ఫిర్యాదు చేశాయి. స్పందించిన ప్రభుత్వ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా.. అసెంబ్లీ సమావేశాల ముగింపు నాటికి సమగ్ర నివేదిక సమర్పించేందుకు ఓ వైపు ఇంటెలిజెన్స్... మరోవైపు స్పెషల్ బ్రాంచ్ ఆరా తీస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా వివాదాస్పదమైన పలు ఆస్పత్రులు, హెల్త్ సెంటర్ల వారీగా వివరాలు సేకరించిన నిఘావర్గాలు.. వరంగల్ నగరంలో ఎంజీఎం, కేఎంసీలతోపాటు జిల్లా కేంద్రాస్పత్రుల్లో బదిలీలు, పోస్టింగ్‌లపైనా గోప్యంగా విచారిస్తున్నాయి.

చివరి రోజు జాతరే..
- రిజిస్ట్రేషన్ శాఖలో భారీ బదిలీలు
- జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం
- ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా డీఐజీ సుభాషిణి
- హనుమకొండలో పలువురు తహసీల్దార్లు, డీటీలు...
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు సైతం..
- ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా అనసూయ

- 8లో ▸

ఇక మీరు మారరా?

- వాహనాల మరమ్మతుల్లో జాప్యంపై మేయర్ ఆగ్రహం
- బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు ఆకస్మిక తనిఖీ



వాహనాల డ్రైవర్లతో మాట్లాడుతున్న సుధారాణి

వరంగల్ అర్బన్: 'పారిశుద్ధ్య వాహనాల మరమ్మతులు వేగంగా చేపట్టాలని ఎన్నిసార్లు హెచ్చరించినా మీరు మారరా' అంటూ.. మేయర్ గుండు సుధారాణి వాహన డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే చివరి అవకాశమని, ఇకపై ఇలాగే చేస్తే చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని వాహనాల మరమ్మతుల షెడ్డును మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన మరమ్మతులు, పెండింగ్‌లో ఉన్న వాహనాల వివరాలపై ఆరా తీశారు. స్వచ్ఛ ఆటో, ట్రాక్టర్లు పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లతో నేరుగా మాట్లాడి వాహనాలు మరమ్మతుల్లో జాప్యానికి కారణాల్ని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వాహనాలకు త్వరితగతిన మరమ్మతులు జరిగేలా షిఫ్టుల వారీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని, డీఈలు పర్యవేక్షించాలని సూచించారు. వరుసగా మూడ్రోజులపాటు తడి, పొడి చెత్తను కేటాయించిన ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోకు చెత్తను అందించిన గృహాలకు జరిమానా విధించాలన్నారు. ఈతనిఖీల్లో బల్దియా ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రాజయ్య, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ సంజయ్ కుమార్, ఐటీ మేనేజర్ రమేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ పనుల్లో వేగం పెంచండి

సమీకృత మార్కెట్ (ఐవీఎస్‌ఎం) నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్‌లోని లక్ష్మీపురం మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న సమీకృత ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్ని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మార్కెట్ నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణ పనుల్ని, తిలక్ రోడ్ పోతన రోడ్ ప్రాంతంలో నిర్మిస్తున్న స్మశాన వాటిక పనుల్ని కమిషనర్ పర్యవేక్షించారు. తనిఖీల్లో ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈలు రాగి శ్రీకాంత్, సతీశ్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

హన్మకొండ అర్బన్: పేదలకు ఇళ్ల స్థలాల కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడిగా పేదలు పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు స్థలాలు, డబుల్ బెడ్రూంలు కట్టించి ఇస్తామని నిర్లక్ష్యం చేసినందువల్లే అధికారం కోల్పోయిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ దీన్ని ఇంకా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి పేదలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇళ్ల స్థలాలిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎస్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి,మద్దెల ఎల్లేశ్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, భిక్షపతి, సంతోశ్, సారంగపాణి, రాజు గౌడ్, శ్రీనివాస్, రవి, ఓదెలు, నర్సయ్య, వెంకటేశ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో వరంగల్ కలెక్టర్ పేరుతో నకిలీ ఖాతా

- మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దంటున్న కలెక్టర్



ఉర్సు ప్రసూతి ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి పేరుతో సైబర్ నేరగాడు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించి డబ్బు వసూలుకు మెసేజ్‌లు పంపుతున్నాడు. దీన్ని గుర్తించిన కలెక్టర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో సైబర్ నేరగాడు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించి పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని కలెక్టర్ సత్యశారదాదేవి సూచించారు. కలెక్టర్ సత్య శారదాదేవి మీటింగ్‌లో ఉన్నారని, అత్యవసరంగా డబ్బులు కావాలంటూ 94784977145 శ్రీలంక నంబర్ నుంచి సైబర్‌నేరగాడు సందేశం పంపి, డబ్బులు ఫోన్‌పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరినట్లు తెలిపారు. గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

సీఎం సభకు ఉపాధ్యాయులను తరలించాలి

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభకు జిల్లా నుంచి ఉపాధ్యాయులను తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే సభకు హాజరై తిరిగి సురక్షితంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం గణాంకదర్శిని ఆవిష్కరించారు. సమావేశంలో డీఈఓ వాసంతి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మోహన్ రావు, జిల్లా రవాణా అధికారి లక్ష్మి, వివిధ మండల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి
ఖిలా వరంగల్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ సత్య శారదాదేవి ఆదేశించారు. ఈమేరకు బుధవారం వరంగల్ రంగశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉర్సు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రంగశాయిపేట యూపీహెచ్‌సీలో డాక్టర్, ఫార్మసిస్ట్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఉర్సు ఆస్పత్రిలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సీకేఎం ఆస్పత్రి పర్యవేక్షకులకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

విద్యార్థులే ప్రచారకర్తలు



వ్యాధులను నిర్మూలించాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, జీహెచ్‌ఎంసీ అధికారులు

నయీంనగర్: విద్యార్థులే వ్యాధుల నిర్మూలన ప్రచార కర్తలని జీడబ్ల్యూఎంసీ బయాలజిస్ట్ మాధవరెడ్డి అన్నారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మర్కజీ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన డెంగీ, మలేరియా వ్యాధుల నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. దోమలు, ఈగలు వంటి చిన్న ప్రాణులే మనుషులకు పెద్ద నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్ గీత మాట్లాడుతూ.. డెంగీ లక్షణాలుంటే సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అనంతరం డెంగీ, మలేరియాను నిర్మూలించాలని కోరుతూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు, మలేరియా శానిటేషన్ సిబ్బంది, అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ అనిల్, హెచ్‌ఐ బలభద్ర రవి, హెచ్‌ఎం జీవీ రామారావు, డాక్టర్ వాసు, చీకటి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా ప్రజలకు సేవలందించాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

రామన్నపేట: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు నిజాయితీగా సేవాలందించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. వార్షిక పోలీస్‌స్టేషన్ల తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయనకు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. సీపీ ముందుగా స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల స్థితిగతుల రికార్డులు, పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. దర్యాప్తులో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను ప్రతీ రోజు తనిఖీ చేయాలని, ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈతనిఖీలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

హన్మకొండ కల్చరల్ : విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో పలు విభాగాల్లో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు పొడిగించామని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 2024 సంవత్సరానికి గాను కర్ణాటక గాత్రం, హిందుస్థానీ గాత్రం, కూచిపూడి నృత్యం, సితార్, పేరిణి నృత్యం, మృదంగం, వయోలిన్ విభాగాల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు బుధవారం ముగియడంతో రూ. 20 ఆలస్య రుసుముతో ఆగస్టు 30వతేదీ వరకు, రూ.50 ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 15 వరకు పొడిగించామని పేర్కొన్నారు.

సదయ్య సేవలు స్ఫూర్తిదాయకం



సదయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హన్మకొండ (పరకాల): ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి అనేక హోదాల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు దయ్యాల సదయ్య సేవలు సహ ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పరకాల ఎంఈఓ ఎస్.రమాదేవి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సదయ్యకు బుధవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓతోపాటు ఉపాధ్యాయులు సదయ్య దంపతులను సన్మానించారు. హెచ్‌ఎం చక్రవర్తుల మధుకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధుకర్, ఎంఎన్‌ఓ నామాల సాంబయ్య, కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కన్వీనర్ వజీదా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

కేయూ క్యాంపస్: కేయూలో 40 రోజుల స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు నేటి నుంచి (గురువారం) ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా ఎంపిక చేసిన బోధనేతర ఉద్యోగులకు నాలుగు వారాల పాటు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను కూడా నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈకార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, విభాగాధిపతి డాక్టర్ దీపాజ్యోతి పాల్గొంటారని పేర్కొన్నారు.

చివరి రోజు జాతరే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బదిలీల జాతర కొనసాగింది. ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా రిలీవ్ అయిన వారు, బదిలీపై వచ్చే వారు బిజీబిజీగా గడిపారు. కొన్నాళ్లుగా కొనసాగుతున్న బదిలీ ప్రక్రియకు బుధవారంతో ఫుల్‌స్టాప్ పడింది. చివరి రోజు జాతరలాగా ఈ ప్రక్రియ జరిగింది. కాగా.. కొందరు అధికారులు బాధ్యతలు స్వీకరించగా వారికి సిబ్బంది అభినందనలు తెలిపారు. మరికొందరు గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.

పలువురు తహసీల్దార్లు, డీటీలు ..

హన్మకొండ అర్బన్: జిల్లాలోని రెవెన్యూ శాఖలో ఇద్దరు తహసీల్దార్లకు కలెక్టర్ ప్రావీణ్య పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరితో పాటు పలువురు నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పించారు. అందులో భాగంగా జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ గౌరీశంకర్‌కు కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ధరణి సెక్షన్ సూపరిటెండెంట్‌గా ఉన్న ఎం.సురేశ్‌ను కమలాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

డీటీల బదిలీలు..

కలెక్టరేట్‌లో డీటీగా పని చేస్తున్న కె.సంతోశ్‌కుమార్‌ను ధర్మసాగర్ డీటీగా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న ప్రణయ్‌ని కాజీపేటకు, కాజీపేటలో పని చేస్తున్న రాజ్‌కుమార్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న ఎం.కృష్ణను పరకాల డీటీగా, అక్కడ పని చేస్తున్న జి.నాగేంద్రప్రసాద్‌ను కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖకు పోస్టింగ్ ఇచ్చారు.

సీనియర్ అసిస్టెంట్లు..

కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వి.అనితను ధర్మసాగర్ ఏఆర్‌ఐగా, అక్కడ పని చేస్తున్న పి.శ్రీనివాస్‌ను హనుమకొండ ఆర్డీఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. జిల్లాకు ఇటీవల మహబూబాబాద్ నుంచి వచ్చిన గూడూరు అనురాధకు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హసన్‌పర్తి ఏఆర్‌ఐగా ఉన్న ఏ.కుమారస్వామికి ఆత్మకూరు సీనియర్ అసిస్టెంట్‌గా, జిల్లాకు కొత్తగా వచ్చిన రమేశ్‌కు శాయంపేట ఏఆర్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. నడికూడ ఏఆర్‌ఐగా ఉన్న రాజేంద్రప్రసాద్‌ను హసన్‌పర్తి ఏఆర్‌ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బల్దియాలో చేరిక, రిలీవ్..

వరంగల్ అర్బన్: జీడబ్ల్యూఎంసీ నుంచి వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు బుధవారం రిలీవ్ కాగా.. వారి స్థానంలో కొంత మంది విధుల్లో చేరారు. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వివరాలు వెల్లడించారు. బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ డైరెక్టర్‌గా, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్లు హైదరాబాద్‌కు స్థానచలనం కలిగింది. ఈఈ బీఎల్ శ్రీనివాస్ బదిలీ కాగా.. ఆయన స్థానంలో మహేందర్ విధుల్లో చేరారు. బల్దియా డీఈలు సంజయ్‌కుమార్, ఇషా జహాన్ జీహెచ్‌ఎంసీకి బదిలీకాగా.. రవికుమార్ వరంగల్ పబ్లిక్‌కు బదిలీ అయ్యారు. ఈముగ్గురు డీఈ స్థానాల్లో కేవలం శ్యాం మోహన్ మాత్రమే బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. బల్దియాకు చెందిన ఏఈ అరవింద జీహెచ్‌ఎంసీకి, రమ్యకృష్ణ నర్సంపేట మున్సిపాలిటీకి, రోజారాణి వరంగల్ పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్‌కు, రాజేశ్వరి టీయూఎఫ్‌ఐడీసీకి బదిలీ అయ్యారు. ఏఈల స్థానంలో కేవలం పరకాల మున్సిపాలిటీకి చెందిన టెక్నికల్ ఆఫీసర్ గౌతమి మాత్రమే బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

నాల్గవ తరగతి ఉద్యోగులకు..

జీహెచ్‌ఎంసీలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న 26 మంది 4వ తరగతి ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. ఎట్టకేలకే బల్దియాకు చెందిన 13 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఆరుగురు అటెండర్లు, ఒక లైన్‌మెన్, ఒక వాచ్‌మెన్, ఒక పంపు ఆపరేటర్, మరో నలుగురు ఇతర విభాగాల సిబ్బందిని పరకాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా అనసూయ

కాశిబుగ్గ: వరంగల్ లేబర్ కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.అనసూయ బుధవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆమె వరంగల్‌కు వచ్చారు. ఈసందర్భంగా కళాశాలలోని పలువురు ప్రొఫెసర్లు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కాశిబుగ్గ :ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అనసూయ

పలువురు ప్రొఫెసర్లకు..

వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో పలువురు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు హైదరాబాద్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు, అక్కడ పని చేస్తున్న వారు వరంగల్‌కు బదిలీ అయ్యారు. వారిలో ప్రసూతి విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సులోచన హైదరాబాద్‌కు.. అక్కడ పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ నాగలక్ష్మి వరంగల్‌కు, స్వస్థ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ రవీందర్ గౌడ్ హైదరాబాద్‌కు.. అక్కడ పని చేస్తున్న డాక్టర్ విజయ్‌గణేశ్‌రెడ్డి వరంగల్, ఆర్ఎస్‌బీకే ప్రొఫెసర్ డాక్టర్ శైలేశ్‌నాథ్ సక్సేనా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు, ఆర్‌వీవీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్యారాణి హైదరాబాద్‌కు, అక్కడ పని చేస్తున్న శ్రీకృష్ణ వరంగల్‌కు, వరంగల్ ద్రవ్యగుణకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ హైదరాబాద్‌కు అక్కడ పని చేస్తున్న డాక్టర్ బాబురావు వరంగల్‌కు, హైదరాబాద్ శల్య విభాగంలో పని చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ వెంకట రమణ వరంగల్‌కు బదిలీపై వచ్చారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు..

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఇంటర్ విద్యా కమిషనర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 45 మంది అధ్యాపకులకు, ఇద్దరు ప్రిన్సిపాళ్లకు, 27 మంది, నాన్ టీచింగ్ సిబ్బందికి, నలుగురు లైబ్రేరియన్లకు బదిలీ అయ్యింది. బదిలీ అధ్యాపకులు గురువారం జాయిన్ కానున్నారు. కాగా.. బుధవారం రాత్రి 9 గంటల తర్వాత బదిలీ ఉత్తర్వులు ప్రిన్సిపాల్స్ లాగిన్‌కు పంపగా.. సర్వర్ స్లోగా ఉండడం వల్ల బదిలీ ఉత్తర్వుల డౌన్‌లోడ్‌లో జాప్యం జరిగింది.

వరంగల్ డీఎంఓగా అనురాధ..

వరంగల్: మార్కెటింగ్ శాఖలో బుధవారం పలువురు ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. రాష్ట్ర కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న జె.అనురాధ వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీఎంఓగా పని చేస్తున్న ఎం.ప్రసాదరావు, వరంగల్ జేడీఎంగా పని చేస్తున్న ఈ.మల్లేశం, డీడీఎంగా పని చేస్తున్న అజ్మీరా రాజునాయక్ బదిలీ ఉత్తర్వులు రాత్రి వరకు వెలువడలేదు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న కె.రాజ్‌కుమార్ గడ్డి అన్నారం మార్కెట్ కమిటీకి బదిలీ కాగా.. అక్కడ పని చేస్తున్న సుకన్య వరంగల్‌కు బదిలీ అయ్యారు. వరంగల్ మార్కెట్‌లోని గ్రేడ్–2 కార్యదర్శిగా భువనగిరి మార్కెట్ కమిటీకి చెందిన డి.అంజిత్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు

- జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం
- ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా డీఐజీ సుభాషిణి

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సబ్ రిజిస్ట్రార్లతోపాటు జిల్లా రిజిస్ట్రార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్, ఐజీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ జాయింట్–1, జాయింట్–2లకు మల్టీజోన్–1లో బదిలీ కాగా, జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న హరికోట్ల రవి వరంగల్ నుంచి హైదరాబాద్ మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా వెళ్లారు. ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న డి.ఫణిందర్ వరంగల్ మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా డీఐజీ సుభాషిణికి ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు ఇలా..

జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్లు : డి.సుజాత డీఐజీ కార్యాలయం సూపరింటెండెంట్ జగిత్యాలకు బదిలీ కాగా జె.రామనరసింహారావు ఖమ్మం జిల్లా కూసుమంచి నుంచి వరంగల్ ఆర్వోకు వచ్చారు. జనగామ సబ్ రిజిస్ట్రార్ జాయింట్–1 టి.సంపత్‌కుమార్ ఖమ్మానికి, ఎ.రవీంద్రబాబు ఖమ్మం మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ నుంచి మహబూబాబాద్‌కు, జగిత్యాల నుంచి జె.కిషన్‌నాయక్ భీమదేవరపల్లికి, సూపరింటెండెంట్ ఆఫీస్ సీ అండ్ ఐజీ నుంచి వరంగల్ మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ విభాగానికి ఏ.తిరుమల రావు బదిలీపై వచ్చారు. అదేవిధంగా అసిస్టెంట్ చిట్స్ రిజిస్ట్రార్ వేణుమాధవ్ వరంగల్ నుంచి కొత్తగూడెం వెళ్లగా, ఇక్కడికి ఖమ్మం రూరల్‌నుంచి అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్ యామినిని బదిలీ చేశారు. అదేవిధంగా వరంగల్ ఆర్వో నుంచి ఆర్.రాజును ఖమ్మం జిల్లా మధిరకు, అమ్జద్‌ను జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నరేశ్ బీబీనగర్‌కు, వరంగల్‌ఫోర్ట్ నుంచి ఏ.కార్తీక్‌ను ఖమ్మానికి, వరంగల్ రూరల్ నుంచి ఎండీ ఖాజా మసియుద్దీన్‌ను కల్లూరుకు, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి నుంచి టి.భాగ్యలక్ష్మిని ఖమ్మం, వర్ధన్నపేట నుంచి జే అరుణను ఖమ్మం రూరల్, నర్సంపేట రామికిషోర్‌రెడ్డిని ఖమ్మం, వరంగల్ ఎంవీ అండ్ ఆడిట్ మోసెస్ భాస్కర్‌ను సత్తుపల్లికి ట్రాన్స్‌ఫర్ చేశారు.

జిల్లాకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు..

భూపాలపల్లికి మంచిర్యాల నుంచి ఆర్.రాము, భీమదేవరపల్లికి జగిత్యాల నుంచి జే.కిషన్‌నాయక్, వరంగల్ ఆర్‌ఓకు స్టేషన్‌ఘన్‌పూర్‌నుంచి అమ్జద్ అలీ, జనగామకు నకిరేకల్‌నుంచి అన్వేశిత, కొడకండ్లకు యాదగిరిగుట్టనుంచి ఎస్.కిశోర్, మహబూబాబాద్‌కు ఖమ్మంనుంచి రవీంద్రబాబు, ములుగుకు ఐజీ ఆఫీస్ సూపరింటెండెంట్ దిలీప్‌చంద్ర గోపాల్ బదిలీ అయ్యారు. అదేవిధంగా నర్సంపేటకు మధిర నుంచి ఏ.గిరిధర్, పరకాలకు ఆడిట్ ఖమ్మంనుంచి సుజన్, వర్ధన్నపేటకు సత్తుపల్లినుంచి వి.ప్రభాకర్‌రావు, వరంగల్ రూరల్‌కు ఇల్లెందు నుంచి సైదులు, వరంగల్‌ఫోర్ట్‌కు ఖమ్మం రూరల్‌నుంచి నరేందర్, వరంగల్ ఆర్‌ఓకు కల్లూరినుంచి ఆనంద్, డీఐజీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా కొత్తగూడెంనుంచి రామ్‌కుమార్ బదిలీ అయ్యారు.

డిగ్రీ అధ్యాపకులకు బదిలీ ఉత్తర్వులు

- నేడు జాయినింగ్
- మానుకోట, మరిపెడ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ

విద్యారణ్యపురి : రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులకు కళాశాల విద్యాకమిషనర్ బుధవారం బదిలీ ఉత్తర్వులు జారీచేశారు. మల్టీ జోన్ –1 పరిధిలో సబ్జెక్టుల వారీగా 1,010 అధ్యాపక పోస్టుల వేకెన్సీలు చూపారు. అందులో క్లియర్ వేకెన్సీలు 561, తప్పనిసరిగా బదిలీలు కావాల్సిన వారు 449 వేకెన్సీలు చూపిన విషయం విధితమే. దరఖాస్తులు చేసుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో ఎక్కువశాతం మంది బదిలీ అయ్యారని సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 214 వరకు వేకెన్సీలు చూపారని తెలిసింది. 14 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 47 మంది అధ్యాపకులు బదిలీ అయ్యారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి బాలికల కళాశాల నుంచి 27 మంది, రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 9మంది, నర్సంపేట నుంచి 13 మంది అధ్యాపకులు బదిలీ అయ్యారని సమాచారం. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయా అధ్యాపకులు రిలీవ్ అయ్యారని తెలిసింది. తమకు బదిలీ అయిన వివిధ డిగ్రీ కళాశాలల్లో గురువారం జాయిన్ కాబోతున్నారని సమాచారం. డిగ్రీ కళాశాలల్లో ఒక చోటే ఐదేళ్లుగా పనిచేస్తున్నారో వారంతా తప్పనిసరిగా బదిలీ అయ్యారని సమాచారం. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకులు ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాల కళాశాలల్లోకి, గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలల్లో విధులు నిర్వర్తించిన అధ్యాపకులు పట్టణ ప్రాంత కళాశాలలకు బదిలీ అయ్యారని తెలిసింది.

డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు..

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ అయ్యారు. ఈ ప్రిన్సిపాల్ పోస్టులు 62 వేకెన్సీలు చూపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు.. గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కవిత హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారని సమాచారం.

స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పేరిట మోసం..

- రూ.75వేలు వసూలు చేసిన సైబర్‌నేరగాళ్లు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు

జనగామ: స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. ఓ మహిళ నుంచి రూ.75 వేలు వసూలు చేశారు. ఈ ఘటన జనగామ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా వైద్యారోగ్య శాఖలో స్టాఫ్‌నర్సు ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న జిల్లాకు చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు గత నెల 27న డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఫోన్ (9831319614) చేస్తున్నామని చెప్పి నమ్మించారు. ఫేక్ మెయిల్ ఐడీ నుంచి ఉద్యోగం వచ్చినట్లు ఆర్డర్ కాపీ పంపించారు. ఖర్చుల కోసం రూ.75వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. రెండు రోజుల తర్వాత ఇంటర్వ్యూకు హాజరుకావాలని చెప్పగా గత నెల 29న డీఎంహెచ్‌ఓ ఆఫీసుకు వచ్చిన సదరు మహిళకు.. అధికారులు తాము ఏ ఆర్డర్ కాపీ పంపలేదని తెలిపారు. దీంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించిన సదరు మహిళ వెంటనే సైబర్ క్రైం విభాగంలో ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం విభాగ అధికారుల సూచన మేరకు డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాలతో స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ ఉద్యోగాల పేరిట ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే స్పందించొద్దన్నారు. ఎవరైనా సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 సైబర్ హెల్ప్ లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సురభి కళాకారులను ఆదరించాలి

- స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి
- అలరించిన శ్రీవీరబ్రహ్మంగారి చరిత్ర నాటకం
- ముగిసిన సురభినాటకోత్సవాలు



మాట్లాడుతున్న ఏసీపీ జితేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : సురభి కళాకారులను ఆదరించాలని, వారి నాటక ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఉంటాయని స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి అన్నారు. సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ మహానగర పాలక సంఘం సహకారంతో జరుగుతున్న సురభి నాటక ప్రదర్శనలు ముగిశాయి. చివరిరోజు ప్రదర్శనలలో భాగంగా శ్రీవీరబ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. బుధవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో అతిథి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డాక్టర్ శాంతికృష్ణ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి నాటకాలు దోహదపడుతాయన్నారు. అనంతరం ఏసీపీ జితేందర్‌రెడ్డి కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ డ్రమోటిక్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, సీనియర్ కళాకారులు మారేడోజు సదానందాచారి, కళారాజేశ్వర్‌రావు, పుష్పలత, రేకందర్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



సీపీ అంబర్‌కిషోర్ ఝాతో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం : ఉద్యోగ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ మేరకు బుధవారం ఉద్యోగ విరమణ పొందిన పలువురు పోలీస్ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పోలీస్‌శాఖలో పనిచేయడమే కాకుండా క్లిష్ట సమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో ప్రధాన కారకులైన వీరిని నేటితరం పోలీసులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసులు విధుల్లో రాణించడానికి తమ కుటుంబ సభ్యులే కారణమన్నారు. వారి సహకారంతోనే తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించొద్దన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఇన్‌స్పెక్టర్ దామోదర్, ఎస్సైలు గాలిబ్ షరీఫ్, కుమారస్వామి, ఏఎస్సైలు సుధాకర్, మక్బూల్, మోహినొద్దీన్, ప్రేమ్‌సాగర్, ముసలయ్య, జైపాల్‌రావు, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ అంజయ్యను సీపీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ, సురేశ్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీనివాస్, స్వర్ణరాజ్, సతీశ్, ఆర్ఎస్సై శ్రవణ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఈఈసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి : 2024–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ)లో ప్రవేశాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆగస్టు 1 నుంచి 6వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించబోతున్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రభుత్వ డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరగబోతోందని డైట్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్, వరంగల్ డీఈఓ వాసంతి బుధవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు హనుమకొండలోని డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు టీజీడీఈఈసెట్ ఆన్‌లైన్ అప్లికేషన్, హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, బోనఫైడ్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. క్యాప్, పీహెచ్‌సీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌అండ్ గేమ్స్ సర్టిఫికెట్లు ఉన్న వారు వాటిని కూడా తీసుకుని హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలు హెచ్‌టీటీపీ://డీఈఈసెట్.సీడీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఆధునిక పరికరాలపై రైతులకు అవగాహన



రైతులకు స్ప్రేయర్‌ను అందజేస్తున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి నిర్మల

వరంగల్ : ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో 'మన అగ్రిటెక్' సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక యంత్ర పరికరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యంత్రాలపై రైతులకు కంపెనీలు అందిస్తున్న సబ్సిడీలు, పరికరాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో ట్రిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్, ఇతర పరికరాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఆఫర్‌లో పరికరాలు పంపిణీ చేశారు. సంస్థ ఎండీ పాశికంటి రమేశ్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సాంకేతికను ఉపయోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి వేదప్రకాశ్, గ్రేడ్–2 కార్యదర్శి రాము, ఏనుమాముల ఎస్సై రాజు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు

- బస్సును వెంబడించి దాడి



కండక్టర్‌పై చెప్పు లేపుతున్న ప్రయాణికురాలు

ములుగు/హన్మకొండ : ఆర్టీసీ ఉద్యోగులపై దాడుల పరంపర కొనసాగుతోంది. ఆర్టీసీ వర్గాలు తెలిపిన వివరాల మేరకు బుధవారం వరంగల్–2కు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వెళ్తోంది. హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ఏటూరునాగారం వెళ్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ బస్సులో ఆత్మకూరు వద్ద ఓ ప్రయాణికురాలు ఎక్కింది. ఇంజన్ బానెట్‌పై కూర్చుంటుండగా డ్రైవర్ బానెట్ ప్లాస్టిక్‌ది పగులుతుందని, లోపలికి వెళ్లాలని సూచించాడు. ఆ ప్రయాణికురాలు బానెట్‌పై కూర్చుంటానని పట్టుబట్టగా వద్దని డ్రైవర్ వారించారు. దీంతో ఆమె దూషణల పర్వం మొదలు పెట్టింది. బస్సులో ప్రయాణికులు కలుగజేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించాలని సూచించగా బస్సును ఆత్మకూరు పీఎస్‌కు తీసుకెళ్లి ఆమెను అక్కడ అప్పగించారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కాని ఆ ప్రయాణికురాలు తన కుమారుడిని తీసుకుని బస్సును వెంబడించింది. ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద బస్సు ఆపి కండక్టర్‌ను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారు. సదరు ప్రయాణికురాలు చెప్పుతో కొట్టబోగా ప్రయాణికులు వారించారు. ఆమె కుమారుడు కండక్టర్‌పై చేయిచేసుకున్నాడు. ఈ ఘటనపై ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ములుగు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, తనపై కండక్టర్ చేయి చేసుకున్నాడని ప్రయాణికురాలు, తనను ప్రయాణికురాలు దుర్భాషలాడిందని కండక్టర్.. ఒకరిపై మరొకరు ఆత్మకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

రెండు రోజుల ముందే మరో ఘటన..

అంతకు రెండు రోజుల ముందు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ వద్ద ఓ తాగుబోతు తనకు బస్సు అడ్డం పెడుతావా అంటూ డ్రైవర్‌పై చేయిచేసుకున్నాడు. ఈ ఘటనపై డ్రైవర్ హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వరుస ఘటనలతో ఆర్టీసీ ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు

కేయూ క్యాంపస్: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు, పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్‌సీ, ఎంఎల్ఐఎస్‌సీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 2024–2025 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఆగస్టు 18వ తేదీ వరకు గడువు ఉందని ఆ యూనివర్సిటీ వరంగల్ ప్రాంతీయ సంచాలకులు, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని స్టడీసెంటర్లలో ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకుగాను విద్యార్హతలు, కోర్సుల ఫీజుల వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ ఆన్‌లైన్.ఇన్‌లో, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో చూడొచ్చని తెలిపారు. అలాగే ఆయా డిగ్రీ కోర్సుల్లో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఇదిలా ఉండగా డిగ్రీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు రెండో, మూడో సంవత్సరం ఫీజులు సకాలంలో చెల్లించలేకపోయిన వారు 2015–2016 విద్యాసంవత్సరం నుంచి 2023–2024వరకు అడ్మిషన్ పొందివుంటే నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు లేదా టిఎస్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించొచ్చని, ఆగస్టు 18 గడువు ఉందని జ్యోతి తెలిపారు.